కవితా కౌముది

## వర్షాకాలం

వారణాసి నాగలక్ష్మి

లయబద్ధంగా చినుకుల చిటపటలు...
పైకప్పు వేదికగా సాగుతోంది సంగీత కచేరీ
పరుచుకునే ఆహ్లాదం, పల్లవించే పచ్చదనం
నేలమ్మ పై నింగి రా(లు)స్తున్న దృశ్య కావ్యం

రాలిపడే చినుకుల్ని ఆత్రంగా పీలుస్తూ
ఎండిపోయిన నేల సజీవమౌతోంది
దాహార్తి తీరాక పరచిన తివాచిపై వాలుతూ
నీరెండ రంగుల గాలిపటాలెగరేస్తోంది

కాలిబాటలమీద గొడుగులై
ఇంద్ర ధనుసులు కవాతు చేస్తున్నాయి
నీటికుంటల్లో చిందులేసే పసికళ్ళలో
నింగి వెలుగులు తళతళలాడుతున్నాయి

మబ్బులన్నీ గుంపులుగా చేరి
నీలాకాశానికి బూడిదరంగు పూస్తున్నాయి
ప్రకృతి పురి విప్పుకుంటోంది
ప్రతీకొమ్మా ఒక వన్నెల వింజామర!

ఊగే తీగలూ చిగుళ్లూ మొగ్గలూ...సాగిపోయే
ఊసుల మధ్య ఫక్కుమనే పూలనవ్వులు!
రాలిపడే గింగిరాల పారిజాతాల విన్యాసాలకి
తోడుగా గాలీ పూలతావీ కలిసి చేసే విహారాలు!

బీళ్లకు మొలకలిచ్చి మోళ్ళకు చిగుళ్లిచ్చి
పనికిరాని కుళ్ళునీ చెత్తనీ, ధూళి నిండిన
ప్రాంగణాలనూ కడిగి శుభ్రపరచే
వర్షధారల అద్భుత నైపుణ్యం

నదుల నాట్యం, ప్రవాహాల ఉధృతం-
శిధిలశకలాలకు కొత్త రూపాన్నిస్తూ
ప్రపంచాన్ని శుద్ధి చేసి నిర్గమించే
త్యాగమేగా వర్షకాలపు వారసత్వం!

★★★



# తెలుసుకో..

అయ్యగారి లక్ష్మణరావు

కష్టమొచ్చి నేనుంటే
ఏడవడం నా ఇష్టం
నా కష్టం నీ కొస్తే
నీకప్పుడు తెలుస్తుంది
ఇదే ఇదే ఇదే ఇదే
విన్నకొద్ది ఇదే ఇదే

ఏడవడం పాడవడం
పాడవడం ఏడవడం
ఏడుస్తూ పాడవడం
పాడౌతూ ఏడవడం

వాడెవడో వున్నాడని
కాపాడూ నన్నంటూ
గుడి లోపల ఉన్నాడని
ఎన్నెన్నో గుడులన్నీ
వడి వడిగా తిరగడం
విడి విడిగా చూడడం

హడావిడే ఇదంతా
విడబడేది అదెల్లా !!

గీతకేసి చూడు చూడు
చూసి చూసి మరీ చూడు

వాడెవడో పోతాడని
వాడెవడో పోయాడని
నీ కెందు కు ఈ ఏడుపు

నవ్వినట్టుగా వున్నా
గట్టిగానే చెప్పాడు
గీత లోని శ్రీ కృష్ణుడు
తృష్ణ అనే కీడు వలన
మృషా మయం
మన బ్రతుకులు
కప్పి ఉన్న మాయవాంక
కళ్ళు విప్పి చూడవేమి

ఒక్కసారి ఏన గాని
లోతుగాను చూసేవా
నిక్కంగా పక్కంగా
వేద వ్యాసుడనేవాడు
ఏమి చెప్పి ఉన్నాడని

పొద్దు పొద్దు నీలోనే
హద్దులేని అలజడి
వద్దు వద్దు అనుకున్నా
సద్దు పడని వేడి
తీరాలని అనుకుంటే
జ్ఞానమనే మందు
అది ఒక్కటి ఒక్కటే
ఈ వ్యాధికి విరుగుడని !!

★★★

## అనివార్యం
### బారు శ్రీనివాసరావు

మాత్రాలెన్ని మింగాలో మరచిన వార్ధక్యాన్ని
గుర్తించని యవ్వనం నిర్లక్షమని పిలుస్తుంది
గొంతెత్తి పిలిచే బధిరత్వానికి
కోపమెక్కువని ముద్ర వేస్తుంది

బడి దగ్గర గతంలో నిన్ను పట్టుకున్న చెయ్యే
గుడి దగ్గర నేడు మోటుగా విదిలిస్తుంది
కలలను నీతో కథలుగా చెప్పిన మనిషే
నువ్వు రాగానే మాట మధ్యలో మార్చేస్తుంది

సీరియలో, సినిమానో కార్యక్రమం ఏదైనా
టీవీ సాయంతో ఒంటరితనంపై పోరు
బంధువో, శత్రువో వచ్చింది ఎవరైనా
కాసేపు మాట్లాడాలని తపించే నోరు

నాడు అందంగా కట్టిన మేడ
నేడు క్రమంగా శిథిమవుతుంది
అచారాలన్నీ చాదస్తాలవుతాయి
నీ ఆరాటం జోక్యమవుతుంది

ఇక పొంచివున్న మృత్యువు తెచ్చే అలజడిని
అనుభవపు శాలువా ఎంత యత్నించినా కప్పదు
అయాచిత జీవనంతో బ్రతికిన విజేతకైనా
అనాయాస మరణంకై జోలె చాచడం తప్పదు

★★★

## అందం
### అనూరాధ బండి

రాలిపోయిన ఆకులని చూసి, చెట్టు
దుఃఖపడుతుందా!
వాడి నేలరాలిన పువ్వుల చుట్టూ
తిరుగుతున్న చీమలు
నిజానికి నివాళులర్పిస్తున్నాయా!
ఇంకా కొన్నిపళ్ళు, చెట్టుకి
మిగిలేఉన్నాయి.
ఆకులూ కొమ్మలూ, అంతా
అలానే అందంగా ఉంది..!
ఇప్పుడు కూడా
ఈ మసకచీకటిలోనే
ఒక పక్షుల గుంపు ఎగిరివెళ్ళడంచూసాను.!!
గుంభనగా ఉండే ఆకాశానికి
జోలపాట పాడేవాడొకడున్నాడు.
పగలంతా జోలెపట్టి
రాత్రుళ్ళు మధురగానం చేస్తాడు.!
మరి దేవతలు కొందరు
గంధర్వవేషంలో
రహదారులను శుద్ధిచేస్తున్నారు.
అందంగా ఉండేది నిజానికి-
తొలిగా కళ్ళు తెరిచినప్పుడు..
మలిగా కళ్ళుమూసినప్పుడు..

అయినా సౌందర్య స్పృహలో
రాత్రిని సందర్శించినప్పుడు

మధ్యన బ్రతుకంతా మిధ్య అని చెబుతావా!!

★★★

# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

జీవితము దాట ప్రాప్తించు స్థితుల గూర్చి
బోధ చేతురు విజ్ఞాన పూర్ణమతులు
గడపకివతలవన్నియు కంటిమెపుడొ
గడపకవతలనేముండు గ్రాహ్యమవదు

చూచి రావలయునని యుత్సుకత గలదె?
మరల వచ్చుట యున్నదే మన వశాన?
ఎల్లలను దాటి పరదేశమేగినపుడు
తిరిగి వచ్చుట మనుజబుద్ధిస్థితమ్ము

ఇచ్చ మనదంచునెంతొ యూహించుచుందు
మైన యూహలే పరిణామమందుచుండు
మరలి వచ్చుటకెందరో మనసు పడరు
ధరణి గడప దాటినగూడ మరలలేము

లేదు స్వర్గమ్ము నరకమ్ము లేదటంచు
తెలిసినట్టులే యెందరో తెలుపుచుందు
రేమి యున్నదో తెలుపుటకెవరు గలరు?
పోయి వచ్చిన వారలు భువిని లేరు

ఏమి యున్నదో కొందరూహించుచుంద్రు
ఎన్నొ విధముల వాని వర్ణించుచుంద్రు
ఇరులనున్నది వీక్షించుటెట్లు పొసగు?
ఎరుగలేనిది మస్తిష్కమెట్లు చేరు?

COMMENTS